## ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తున్నాం: పొంగులేటి

హైదరాబాద్: సర్పంచ్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. స్థానికులు ఎన్నికలు రాబోతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. వైరా మండలంలో కాంగ్రెస్ కార్యకర్తలతో మంత్రి పొంగులేటి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు. ఈ నెల 15 లోపు సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ కు అవకాశం రానుందని తెలియజేశారు. ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామని మంత్రి స్పష్టం చేశారు.


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్,B.A:L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 04-02-2025 | సంపుటి : 06 | సంచిక : 264 | పేజీలు : 8 | వెల : రూ 3-00


## 'శీష్ మహల్'ను తెరుస్తాం: అమిత్‌షా



న్యూఢిల్లీ: కోట్లాది రూపాయల ప్రజాధనంతో అరవింద్ కేజ్రీవాల్ నిర్మించిన "శీష్ మహల్" ను ప్రజా సందర్శన కోసం తెరుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారు. రూ. 51,000 కోట్ల ప్రజాధ నంతో అద్దాలమేడ ను కేజ్రీవాల్ నిర్మించారని అన్నారు. జాంగ్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడుతూ, కేజ్రీవాల్‌కు ఒక ఇల్లుతో సంతృప్తి లేకనే 'అద్దాలమేడ' నిర్మించుకున్నారని చెప్పారు."ముఖ్యమంత్రి అయ్యాక ఇల్లు కానీ, కారు కానీ, సెక్యూరిటీ కానీ తీసుకోనని 2013లో కేజ్రీవాల్ చెప్పారు. అయితే ఆ తర్వాత కారు, బంగ్లా తీసుకున్నారు. ఒక బంగ్లాతో ఆయనకు తృప్తి కలగలేదు. దాంతో శీష్ మహల్ నిర్మించారు. అందుకైన రూ. 51,000 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? అదంతా ఢిల్లీ ప్రజలకు చెందిన సొమ్ము. శీష్ మహల్‌ను ప్రజాసందర్శన కోసం ఉంచుతామని నేను వాగ్దానం చేస్తున్నారు. కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన కేజ్రీవాల్‌కు తిరిగి ఓటు వేసి అధికారం కట్టబెట్టాలా?" అని అమిత్‌షా ప్రశ్నించారు. ప్రతాప్‌గంజ్ ప్రజలను మాజీ ఉమ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా మోసం చేశారని అమిత్‌షా ఆరోపించారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడంతో ఎక్కడ ప్రజలు నిలదీస్తారో అనే భయంతో ఆయన ప్రతాప్ గంజ్ నియోజకవర్గాన్ని వదిలిపట్టి జాంగ్‌పురకు వెళ్లిపోయారని అన్నారు. ఇదే సిసోడియా డిప్యూటీ సీఎంగా ఆలయాలు, స్కూళ్లు, గురుద్వారాల సమీపంలో లిక్కర్ దుకాణాలు తెరిపించారని, దేశంలోనే ఒక లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన ఏకైక విద్యాశాఖ మంత్రి ఆయనేనని విమర్శించారు. బడే మియా (కేజ్రీవాల్) చోటే మియా (సిసోడియా) కలిసి ఢిల్లీ ప్రజలను వంచించారని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగియనుంది. ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

## ఫుడ్ సెక్యూరిటీకి గ్లోబల్ హబ్‌గా భారత్

**ఎమ్ఎస్ఎమ్ఈ పాలసీకి గేమ్‌ఛేంజర్‌గా మారుతోంది**
**ఏఐ సాంకేతికతలో ముందు వరుసలో ఇండియా**
**వికసిత భాతర్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్**
**మీడియాతో సిఎం చంద్రబాబు వెల్లడి**


న్యూఢిల్లీ,ఫిబ్రవరి3 : ఫుడ్ సెక్యూరిటీకి గ్లోబల్ హబ్‌గా భారత్ మారబోతోందని ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఎమ్ఎస్ఎమ్ఈ పాలసీకి గేమ్‌ఛేంజర్‌గా భారత్ మారనుందని పేర్కొన్నారు. భారత్ అభివృద్ధిని ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏఐ సాంకేతికతలో భారత్ ముందు వరుసలో ఉందన్నారు. బీజేపీ, ఎన్డీఏకు ఎందుకు ఓట్లు వేయాలో చెప్పడానికి ఢిల్లీ వచ్చానని అన్నారు. ఢిల్లీ చూసిన ప్పుడు అందరిలో ఒక అభిప్రాయం వస్తుందని.. ఢిల్లీలో వాతావరణ కాలుష్యం, రాజకీయం కాలుష్యం ఆరోగ్యానికి హానీకరమన్నారు. ఢిల్లీలో కలుషితమైన నీరు ఉందని.. యమున కలుషితం అయిపోయింద న్నారు. వికసిత భారత్ రియాలిటీ అని చెప్పుకొచ్చారు. వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ పేరు మారుమోగుతోందని తెలిపారు. భారత్‌లో భారీ పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు వస్తున్నారని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించబోతోందని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారని తెలిపారు. పవర్, ఇన్సూరెన్స్, మైనింగ్ సహా పలు రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చామని. పలు రంగాల్లో భారీ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఏపీలోనే తొలిసారి విద్యుత్ రంగం సంస్కరణలు తీసువచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ బడ్జెట్ సమ్మిళిత అభివృద్ధికి దోహదం చేస్తుందని.. అన్నదాత, యువత, మహిళలు ఈ బడ్జెట్ ద్వారా ఎక్కువ ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. వ్యవసాయ రంగంపై ఇప్పటికే దేశ జనాభా లో 50శాతం కంటే ఎక్కువ ఆధారపడి ఉన్నారన్నారు. దీనిపై ఫోకస్ పెంచడం ద్వారా భారత్ ఫుడ్ సప్లయ్ చైన్‌లో గ్లోబల్ లీడర్ అవుతుందన్నారు. ఈరోజుల్లో వర్క్ ఫ్రమ్ హోం సాధారణం అయిపోయిందని.. ఇంట్లో కూర్చుని మరోవైపు వ్యవసాయం పర్యవేక్షించుకుంటూ ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు.



ఈ బ్జడెట్ ద్వారా మరింత ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇచ్చారని.. సూర్య ఘర్ పథకం ద్వారా విద్యుత్ పంపిణీ నష్టాలు లేకుండా స్వయం సమృద్ధి కుటుంబ స్థాయిలో సాధ్యపడుతుందన్నారు. 'చాలా కాలం క్రితం ఒక మాట చెప్పా.. కమ్యూనిజం అయిపోయింది.. ఇప్పుడు టూరిజం మాత్రమే మిగిలి ఉంది అని. ఇప్పుడు అదే జరిగింది. చైనాలో కూడా అనుసరిస్తున్న విధానం కమ్యూనిజం కాదు. సరైన నాయకత్వంలో సరైన దిశలో దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నడుస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న ఢిల్లీ, పంజాబ్‌లో రెండూ ఫెయల్యూర్ మోడల్స్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో డ్రైనేజీ వాటర్, డ్రింకింగ్ వాటర్ కలిసిపోతున్నాయన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలని అనుకున్నారని.. కానీ ఢిల్లీలో ఆ పథకాన్ని అమలు చేయలేదని.. అలా చేస్తే క్రెడిట్ మోడీకే వెళ్తుందని చేయలేదని అన్నారు. స్వచ్ఛ భారత్ కూడా అమలు చేయలేదని.. ఢిల్లీలో ఎక్కడ చూసినా దుర్గంధమే... చెత్తాచెదారమే అని విమర్శించారు. ఢిల్లీలో కొత్త మౌలిక వసతులు ఏవైనా కల్పించారా? ఎప్పుడో కట్టినవే తప్ప కొత్త ప్రాజెక్ట్స్ ఏమీ లేవన్నారు.

## ఎపికి నిధులిచ్చి ఆదుకోవాలి

**గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం దివాళా**
**రంగాల వారీగా పవ్ పాయింట్ ప్రజెంటేషన్**
**ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియాతో చంద్రబాబు భేటీ**




న్యూఢిల్లీ,ఫిబ్రవరి3 : ఆర్థికంగా గట్టెక్కించే చర్యలకు సహకరించాలని అరవింద్ పనగడియాను చంద్రబాబు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులే లక్ష్యంగా సీఎం నారా చంద్రబాబునాయుడు సోమవారం 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగడియాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం సుమారు రెండు గంటలపాటు జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తొలుత 45 నిమిషాల అనుకున్న భేటీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై రెండు గంటల పాటు చర్చ జరిగింది. ఏపీ ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల వైసీపీ దుష్పరిపాలన, పలు రంగాల వారీగా జరిగిన నష్టంపై 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీ తక్కువ జీడీపీ ఉండటం, దానికి గల కారణాలపై కూడా ప్రజంటేషన్‌లో వివరించారు. ఇటీవల నీతి ఆయోగ్ ఇచ్చిన ఆర్థిక ఆరోగ్య నివేదికలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గురించి చెప్పిందని, రాష్ట్రం అప్పు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నివేదించిందని చంద్రబాబు గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలను పనగడియా దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో రంగాల వారీగా జరిగిన నష్టంపై చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై ఆయన వివరించారు. 'దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీకి తక్కువ జీడీపీ ఉంది. ఐదేళ్ల దుష్పరిపాలన తో రాష్ట్రం చాలా నష్టపోయింది. ఏపీ ఆర్థిక స్థితి దారుణంగా ఉందని.. అప్పులు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నీతిఆయోగ్ చెప్పింది. గత ఐదేళ్లలో రూ. 10లక్షల కోట్ల అప్పులు తెచ్చారు. రూ.లక్షన్నర కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. 2014-19 మధ్య అభివృద్ధికి, ఆ తర్వాత ఐదేళ్లలో చోటు చేసుకున్న దుష్పరిపాలనతో పొంతన లేకుండా పోయిందని, రాష్ట్రం చాలా నష్ట పోయిందని ప్రజంటేషన్‌లో చంద్రబాబు తెలిపారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రత్యేకంగా ప్రజంటేషన్‌లో సీఎం చంద్రబాబు వివరించారు. దీని కారణంగా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చూపుతున్న ప్రభావం గురించి ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రూ. 10 లక్షల కోట్ల అప్పులు తీసుకువచ్చారని, దానికి తోడు మరో రూ. లక్షన్నర కోట్లకు పైగా... పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని చంద్రబాబు తెలిపారు. ఈ పరిణామాల నుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా గ్గటెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రజంటేషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులు, లాజిస్టిక్ పార్కులు, పరిశ్రమలు వచ్చేందుకు అనువైన వాతావరణాన్ని ఎలా తయారు చేస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఉన్న మార్గాలపై కూడా వివరించి అందుకు సహకరించాలని కోరారు. పోర్టు ఆధారిత, పరిశ్రమల ఆధారిత అభివృద్ధి ఎలా చేయాలన్న దానిపై ఇరువురు నేతలు కీలకంగా చర్చించారు.

## రైల్వే కేటాయింపుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు పెద్దపీట

**తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు**
**కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నాం**
**త్వరలో దేశమంతా దాదాపు 100 నమో భారత్ ఎక్స్‌ప్రెస్‌లు**
**రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి**



న్యూఢిల్లీ,ఫిబ్రవరి3 : తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు నడుపుతామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రైల్వే ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు అన్యా యం జరగలేదని వివరించారు. కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని, కొన్ని పనులకు అనుమతులు రావాల్సి ఉన్నందున ఆలస్యం అవుతోందన్నారు. సోమవారం దిల్లీలో ఆయన మీడి మాట్లా_డారు.'ఇటీవల స్విట్జర్లాండ్ వెళ్లి అక్కడి రైల్వే ట్రాక్‌లను పరిశీ రైల్వే ట్రాక్‌ల నిర్వహణలో స్విట్జర్లాండ్ వ్యవస్థను పాటిస్తున్నాం. వందే భారత్ ట్రైన్లలో స్లీపింగ్ సీట్లపై ట్రయల్ జరుగుతోంది. ముఖ్యమైన స్టేషన్ల పరిధిలో రక్షణ వ్యవస్థ కవచ్ ఏర్పాటు చేస్తున్నాం. తెలంగాణలో 1,326 కి.మీ మేర ప్రస్తుతం కవచ్ టెక్నాలజీ ఉందని అన్నారు. మరో 1,026 కి.మీ.మేర ఈ టెక్నాలజీ ఏర్పాటు చేస్తున్నాం. 2026లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీ అందుబాటులోకి తీసుకొస్తాం. సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తాం. తెలంగాణ నుంచి ప్రస్తుతం ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని రైల్వే లైన్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. పేద వర్గాల కోసం నమో భారత్ రైళ్లను నడుపుతున్నాం. త్వరలో దేశమంతా దాదాపు 100 నమో భారత్ ఎక్స్‌ప్రెస్‌లు తీసుకురానున్నాం. ఈ రైళ్ల ద్వారా పేద ప్రజలు ఎక్కువగా లబ్ది పొందనున్నారు' అని కేంద్ర మంత్రి తెలిపారు. ఏపీలో రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ. 9,417 కోట్లు కేటాయించామని కేంద్ర మంత్రి తెలిపారు. యూపీఏ హయాంతో పోల్చితే ఈ కేటాయింపులు 11 రెట్లు ఎక్కువన్నారు. రాష్ట్రంలోని 73 రైల్వే స్టేషన్ల రూపురేఖలను పూర్తిగా మారుస్తున్నామని.. ఈ స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు కేటాయించామన్నారు. ఏపీకి మరిన్ని నమో భారత్, వందేభారత్ రైళ్లు కేటాయించామన్నారు. రైళ్ల వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికత సాయంతో రైల్వేల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో ఇప్పటికే అనేక రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని.. అందుకే ఏపీ రైల్వే ప్రాజెక్టుల గురించి బ్జడెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించలేదని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి**




గణియావిభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 - ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎలాంటి మాల్ ప్రాక్టీస్ లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డిఐఈఓ సునీత, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ స్పెషల్ ఆఫీసర్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మనమిత్ర ద్వారా పౌర సేవలు అందించండి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 - ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది సేకరిస్తున్న సర్వే పగడ్బందీగా నిర్వహించి నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో 17 శాఖలకు సంబంధించిన ప్రభుత్వ ఆస్తులను జియో ట్యాగింగ్ చేసి ఫోటో అప్లోడ్ చేయడంతో పాటు సంబంధిత వివరాలను నమోదు చేయాలన్నారు. అలాగే హౌస్ హోల్డ్ డేటాను కూడా పక్కాగా జియో కోఆర్డినేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. మనమిత్ర వాట్సాప్ గ్రూపు ద్వారా 161 పౌర సేవలను అందించేందుకు సచివాలయం సిబ్బంది సమాయత్తం కావాలన్నారు. ప్రతి సెక్రటేరియట్ నుండి ఒక సర్వీస్ అన్న వాట్సాప్ ద్వారా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో 198 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ విథిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



# సంపాదకీయం

మంగళవారం 04-02-2025

## సామూహిక మరణాలను ఆపాల్సిందే

సంగం నోస్ వద్ద వేర్వేరుగా వచ్చి గంగా, యమునా నదీ ప్రవాహాలు ఒక్కటిగా కలిసిపోయి ముందుకుసాగడం చూడొచ్చు. ఇక్కడ రెండు నదులు వేరువేరు రంగులలో కనిపిస్తాయి. యమునా నదీజలాలు లేత నీలం రంగులో, గంగాజలం కొద్దిగా బురదమయంగా కనిపిస్తుంది. యమునా నది ఇక్కడ గంగానదిలో కలిసి అంతర్ధానమవుతుంది. అంతర్వాహినిగా సరస్వతి నది సైతం సంగమించే ఈ ప్రాంతాన్నే కుంభమేళాలోని ప్రధాన సంగం ఘాట్‌గా చాలా మంది భావిస్తారు. వివిధ సంప్రదాయాలకు చెందిన అఖాడా సాధువులు తమ ఆచారాలు, అమృత స్నానాలను సంగం నోస్ వద్దే ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. శతాబ్దాల క్రితం జనాభా తక్కువ. అందులోనూ ఈ స్థాయిలో భక్తజనకోటి లేదు. కాబట్టి ఆనాడు కుంభమేళాకు విచ్చేసిన భక్తులంతా కేవలం ఈ త్రివేణి సంగమ స్థలి వద్దే పవిత్ర స్నానాలు ఆచరించేవారని స్థానికులు చెబుతున్నారు. దీంతో తాము కూడా ఈ సంగం నోస్ వద్దే పుణ్యస్నానాలు ఆచరించాలని ఈ విషయం తెల్సిన చాలా మంది భక్తులు భావిస్తారు. వాస్తవానికి 4,000 హెక్టార్లలో విస్తరించిన ఘాట్‌లలో సంగం నోస్ కూడా ఒకటి. సంగం నోస్ వద్ద ఎక్కువ మంది స్నానాలు ఆచరించడానికి వీలుపడదు. కానీ జనం ఇక్కడే ఎక్కువగా స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపడంతో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒడ్డు వెంట ఇసుక బస్తాలు వేసి, డ్రెడ్జింగ్ చేసి ఎక్కువ మంది కొనదాకా వచ్చి స్నానాలు చేసేలా దీనిని పెద్ద ఘాట్‌గా మార్చారు. కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి రావడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడం దురదృష్టకరం. ఈ దుర్ఘటనలో పదుల సంఖ్యలో భక్తులు మృతిచెందంతో పాటుగా 60 మంది గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా కుంభమేళాతో పాటుగా పర్వదినాలు, ఆధ్యాత్మిక సమ్మేళనాల సందర్భంగా ఇలాంటి తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నాయి. వందలమంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే వేడుకల ఏర్పాట్లలో పాలకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటనలు గుర్తు చేస్తున్నాయి. భక్తులు సైతం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఇవి నొక్కి చెప్తున్నాయి. వదంతులు, భక్తుల్లో భయాలు, తామే ముందుండాలనే తొందరపాటు కారణంగా జరిగే తోపులాటలే ఎక్కువగా ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి. గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో భోలే బాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్లముందు మెదులుతూ ఉంది. బాబా పాదధూళి కోసం భక్తులు ఎగబడ్డంతో జరిగిన ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారిలో అత్యధికులు మహిళలే. మొన్నటికి మొన్న తిరుమల వెంకన్న సన్నిధిలో ముక్కోటి దర్శనం టోకెన్ల కోసం భక్తులు ఒక్కసారిగా ఎగబడ్డంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, 40 మంది గాయపడ్డారు. ఇలాంటి దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోయే వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలే ఉంటుండడం గమనార్హం. మహిళలు ఆందోళనకు గురికావడం లేదా కిందపడిపోవడం, తల్లుల చేతుల్లో లేదా వెంట ఉండే చిన్నారులు కూడా వారితో పాటే ఊపిరాడక చనిపోవడమే ప్రధాన కారణం. 2005లో మహారాష్ట్రలోని మంధర దేవి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వెళ్లడం, ఆలయమెట్లపైనుంచి జారి భక్తులు ఒకరిపై మరొకరు పడ్డంతో 340 మంది ప్రాణాలు కోల్పోయారు. 2008లో హిమాచల్‌ప్రదేశ్‌లో నైనాదేవి ఆలయంలో జరిగిన తోపులాటలో 162 మంది భక్తులు దుర్మరణం పాలయ్యారు. కొండచరియలు విరిగిపడుతున్నాయన్న వదంతులే ఈ ప్రమాదానికి కారణం. 2008లో రాజస్థాన్‌లోని చాముండేశ్వరీ దేవి ఆలయంలో, 2013లో నవరాత్రుల సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని రత్నగఢ్ మందిరంలో జరిగిన తొక్కిసలాటలోనూ వందల ప్రాణాలు గాలిలో కలిసిపోవడానికీ ఇలాంటి వదంతులే కారణం. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు ఘటనాస్థలంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉంటాయి. సాయం కోసం క్షతగాత్రులు చేసే ఆక్రందనలు, భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు చెల్లాచెదరుగా పడిపోవడమే కాకుండా ఒక్కోసారి డబ్బు, విలువైన వస్తువులు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాగా మౌని అమావాస్య నాడు పవిత్ర స్నానాలకు పదికోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు ముందునుంచీ చెబుతున్నా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు మాత్రం చేయకపోవడమే తొక్కిసలాటకు కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ తొక్కిసలాట జరిగింది. వెలుతురు సరిగా లేకపోవడం, తోపులాటలో ఒకరిపై ఒకరు పడిపోవడం వారిపైనుంచి జనం నడుచుకు పోవడంతో ఎక్కువ మంది చనిపో వడమో, గాయపడ్డమో జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దేశంలో ఇప్పటివరకు జరిగిన అన్ని తొక్కిసలాట ఘటనలకూ దాదాపుగా ఇలాంటివే కారణాలు కావడం గమనార్హం. గతంలో పోలిస్తే ఇప్పుడు ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలకు భక్తుల రాక పెరిగింది. ప్రత్యేక రవాణా సదుపాయాలు, నిర్వాహకులు, ప్రసార మాధ్యమాలు చేసే ప్రచారం ఇందుకు ప్రధా న కారణం. వేదభూమి అయిన భారత దేశంలో ఆధ్యాత్మిక చైతన్యం మంచిదే కానీ ప్రాణంకన్నా ఏదీ ఎక్కువ కాదనే విషయాన్ని భక్తులు సైతం గుర్తుంచుకోవాలి. వీఐపీలకన్నా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తే ఎంత రద్దీనైనా అదుపు చేయవచ్చునే విషయాన్ని గ్రహిస్తే భవిష్యత్తులోనైనా ఇలాంటి సామూహిక మరణాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

## దివ్యాంగుల సంక్షేమానికి సహకరిస్తాం

### హరినాద్ రెడ్డి, విజయభాస్కర రెడ్డి, అనిల్ కుమార్. వైద్యులు





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 – నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, సెయింట్ ఆన్స్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో 70 మంది మానసిక దివ్యాంగ బాలలకు నిత్యావసర కిట్లు పంపిణీ చేయడం జరిగింది. నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యుడు మేడ చంద్రశేఖర్ సౌజన్యంతో రెండు కాళ్లు పనిచేయని శారీరక దివ్యాంగునికి అయిదు వేల రూపాయల విలువచేసే చక్రాల కుర్చీ అందజేయడం జరిగింది. నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ హరినాథ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరి రమేష్, కోశాధికారి మామిల్ల నాగరాజు, జోన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సోమేశుల నాగరాజు పాల్గొని దివ్యాంగ బాలలకు నిత్యావసర కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా అనేక సంవత్సరాలుగా దివ్యాంగుల సంక్షేమానికి సహకరిస్తున్న వైద్యులు హరినాథ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, అనిల్ కుమార్ లను దివ్యాంగుల సంక్షేమ సంఘం తరఫున ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ సంఘం చేసే కార్యక్రమాలకు నంద్యాల ఐఎంఏ, లయన్స్ క్లబ్ సభ్యులు నిరంతర సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. వైద్యులు హరినాద్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, అనిల్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా దివ్యాంగుల సంక్షేమానికి తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు. మానసిక దివ్యాంగ బాలల పాటలు ఆహుతలను అలరించాయి. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ మానసిక దివ్యాంగుల కేంద్ర నిర్వాహకులు సిస్టర్ రీనా జోస్, సిస్టర్ జోసెఫ్ రాణి, సిస్టర్ స్వప్న ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గత ఐదు సంవత్సరాలలో రైతులను పట్టించుకున్న నాధుడే లేడు :భూమా అఖిల ప్రియ ఎమ్మెల్యే





---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 – గత ఐదు సంవత్సరాలలో రైతుల గురించి పట్టించుకునే నాథుడే లేడని గతంలో రైతుల కోసం ఎన్నో పోరాటాలు చేసామని అర్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. సోమవారం నాడు తెలుగు గంగ ప్రాజెక్ట్ చైర్మన్ సంజీవ్ కుమార్ రెడ్డి తో కలసి నూతన కార్యాలయంను ప్రారంభించారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని తెలుగు గంగ ఆఫీసులో నూతనంగా తెలుగు గంగ ప్రాజెక్ట్ చైర్మన్గా నియమితులైన సంజీవ్ కుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు నూతన కార్యాలయం ప్రారంభం కార్యక్రమంలో పాల్గొనట్లు తెలిపారు . తెలుగు గంగ ప్రాజెక్టు చైర్మన్ గా ఎన్నికైన సంజీవ్ కుమార్ రెడ్డి కి అభినందనలు తెలిపారు . రైతులందరూ చైర్మన్ కి సహకరించాలని సూచించారు . ఆళ్లగడ్డ ఆయకట్టు 60 వేల ఎకరాల ఉందని , ఇంకా పెంచుకునే అవకాశం కూడా ఉందన్నారు , కళ్ళముందే నీరు వెళ్తున్నా రైతులు వాడుకోలేని దుస్థితిలో ఉండేవారన్నారు. చాలా సార్లు గత ప్రభుత్వంలో నేను రైతుల కోసం పోరాటాలు చేయడం జరిగిందన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు నిర్మాణం కోసం ముఖ్య కారకుడైన మాజీ సియం స్వర్గీయ ఎన్టీ రామారావే నని అన్నారు. మా ప్రాంతంలో ఈ తెలుగంగ రాకుంటే, అలాగే ఫ్యాక్షన్ లోనే ఉండేవారని, నేడు తెలుగంగ వల్ల అందరూ రైతుల్లాగా మారి సంతోషంగా ఉన్నారన్నారు. తెలుగు గంగ కింద ఉన్న రైతులందరికీ. డీసీలు డైరెక్టర్లు చైర్మన్ తెలుగంగ సంబంధించిన అధికారులు కానీ ప్రతి ఒక్కరూ రైతులకు సహకరించి వాళ్లకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు . గత ఐదు సంవత్సరాలు రైతులను పట్టించుకునే నాధుడే లేదని అన్నారు.

## అటలకు అందుబాటు లోకి స్కూల్ గ్రౌండ్

### దేరేడ్డి శివ నాగిరెడ్డి వైయస్ ఆర్ నగర్ టిడిపి పార్టీ ఇన్ చార్జ్



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 – వైయస్ ఆర్ నగర్ లో ఉన్న స్కూల్ గ్రౌండ్ పిల్లలు అటలాడుకోవచ్చు అని వైయస్సార్ నగర్ టీడీపీ పార్టీ ఇన్ చార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ వైయస్ ఆర్ నగర్ లో స్కూల్ గ్రౌండ్ గతంలో పిల్లలకు ఆటలాడుకోవటానికి ఇబ్బంది కరంగా ఉండటంతో జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఆదేశాల మేరకు నందమూరి నగర్ , వైయస్సార్ నగర్ ఎంపీ యుపిఎస్ స్కూల్ గ్రౌండ్ కు మట్టితోలడము , డోజర్ తో గ్రౌండ్ ను తయారు చేయడం జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, ఎన్ ఎమ్ డి ఫిరోజ్ కు టిడిపి పార్టీ ఇన్ చార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారన్నారు.

## పేదలకు స్వచ్ఛందంగా వైద్య సేవలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 – మహదేవపురంలో ఆదివారం శ్యామల చారిటబుల్ ట్రస్ట్ వారి నంద్యాల శ్యామల మల్టీస్పెషలిటీ హాస్పిటల్ అద్వర్యంలో ఆదివారం సిరివెళ్ల మండలం, మహదేవపురం గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు . ఈ శిబిరంలో డాక్టర్ సంజీవ జనరల్ సర్జన్,డాక్టర్ శ్యామల గైనకాలజీ,డాక్టర్ మబుసుభన్ ఆర్థోపెడిక్స్ విభాగాల సంబంధిత డాక్టర్లు పాల్గొన్నారు. గాజులపల్లి, మహాదేవపురం కోటకొండ చుట్టుపక్కల గ్రామాలనుండి దాదాపు వెయ్యి మంది ఈ శిబిరంలో వైద్య సేవలను వినియోగించు కున్నారు .ఈ శిబిరంలో ముఖ్యంగా గర్భిణీ మహిళలకు పలు సూచనలిచ్చారు . వైద్య శిబిరం లో ఉచితంగా ఐదు వందల మంది షుగర్, హెచ్‌బీ రక్త పరీక్షలు చేయించుకున్నారు . గర్భిణీ మహిళల ఆరోగ్యాన్ప్రోత్సహించడం, ప్రెగ్నెన్సీ సమయంలో రక్తహీనత వల్ల వచ్చే సమస్యల గురించి అవగాహన కల్పించారు. ఈ క్యాంపు లో పాల్గొన్న పేషెంట్స్ కి డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవలు మరియు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని శ్యామల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో రాజేష్ గౌడ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నరహరి , మరియు గుడపోగుల నరసింహా మోష, రామకృష్ణ, నరహరి, ఆదాం, హరీషచంద్ర , నర్సమ్మ మొదలుగు వారు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో రాజేష్ గౌడ్ మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరం నిర్వహించిన డాక్టర్స్ కి శ్యామల మల్టీస్పెషలిటీ హాస్పిటల్, యాజమాన్యం కి మరియు వారి స్టాఫ్ కి ప్రత్యేకంగా గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు

## ఎండల కాలం మొదలైంది పంచాయతీ నీరు కరువైంది



ముదిగుబ్బ ఫిబ్రవరి 3 మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ నాయకులు మండల ఇంచార్జ్ ఎంపీడీవో దివాకర్ కు వినతిపత్రం అందజేశారు, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ సౌత్ స్టేట్స్ గౌరవాధ్యక్షులు బి వెంగమేష్ చౌదరి మద్దతు పలికారు, ఈ సందర్భంగా సిపిఐ నాయకులు చల్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో గత 8 నెలలుగా గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో పాటు మోటార్ల రిపేర్లు, పైపులైన్లు మరమ్మతులు తదితర వాటికోసం నిధులు కూడా కేటాయించకపోవడంతో గత కొన్ని నెలలుగా తాగునీటి సరఫరా లో తరచూ తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని విచారణ వ్యక్తం చేశారు, ఈ పరిస్థితిలో తాగునీటి సరఫరాకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంతో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతూ మండల ప్రజలు ముఖ్యంగా ముదిగుబ్బ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు, మండల కేంద్రమైన ముదిగుబ్బలో రోజు 14 లక్ష లీటర్ల తాగునీరు సరఫరా కావాల్సి ఉండగా గత కొన్ని వారాలుగా కేవలం మూడు నుంచి నాలుగు లక్షల లీటర్లు మాత్రమే సరఫరా అవుతుండడంతో ఆ నీరు పట్టణ ప్రజలకు సకాలంలో అందక గత్యంతరం లేని స్థితిలో ట్యాంకుల ద్వారా నీటిని కొనాల్సిన దుస్థితి ఏర్పడుతోందని సిపిఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు, వేసవికాలం ఇంకా ప్రారంభం కాకనే ఇప్పటికే తాగునీటి ఎద్దడి మొదలైందని పూర్తి ఎండాకాలంలో ఈ సమస్య ఎంత భయంకరంగా ఉంటుందోనని శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు, కనుక ఇప్పటికైనా ఎన్డీఏ ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటి సరఫరా కార్మికులకు రావాల్సిన 8 నెలల పెండింగ్ జీతాలు చెల్లించి తద్వారా నీటి సరఫరా నిర్వహణకు కూడా తగినన్ని నిధులు కేటాయించి మండల వ్యాప్తంగా భవిష్యత్తులో నీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు, లేని పక్షంలో త్వరలోనే మహిళలతో కలిసి ముదిగుబ్బలో పెద్ద ఎత్తున రాస్తారోకో కార్యక్రమం నిర్వహిస్తామని ఈసందర్భంగా చల్లా శ్రీనివాసులు ప్రభుత్వానికి తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య తో పాటు స్థానిక నాయకులు గంగిరెడ్డిపల్లి నాయుడు, తుమ్మల చిన్నప్ప, లింగుట్ల వెంకట రాముడు, మటన్ భాష, మల్లాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు,

## అవార్డు గ్రహీతలకు సన్మానం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 3 నంబులపుల కుంట మండలం నుంచి ఐదు మంది పలు శాఖల్లో పని చేస్తున్న అధికారులుజిల్లా కలెక్టర్ చే అవార్డులు అందుకున్న వారికి ఇన్చార్జ్ ఎంపీడీవో అంజనప్ప, ఎంపీపీ రాము దుశ్యాలను కప్పి పూలమాలవేసి సన్మానించారు . సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అవార్డులు అందుకున్న అధికారులకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఎంపీడీవో ఎంపీపీ ఇరువురు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు మంచి సేవలు అందించినప్పుడు ఆలాంటి అధికారికి గుర్తింపులు పొందుతారన్నారు. అలాంటి వ్యక్తులకు ప్రభుత్వం కూడా మంచి అధికారులుగా గుర్తింపు పొంది అవార్డులను అందజేస్తున్నట్లు వివరించారు. గత నెల జనవరి 26న జరిగిన 76వ గణతంత్రదినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉత్తమ అధికారులుగా గుర్తింపు పొందిన వారికి జిల్లా కలెక్టర్ టిఎన్ చేతన్, జెసి అభిషేక్ కుమారులచే ప్రశంస పత్రాలు అందుకున్నారు. అందులో భాగంగా నంబులపూలకుంట మండలం నుంచి వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రెడ్డి భాస్కర్, వీఆర్వో అనూష, మరో ఇద్దరు అవార్డులు తీసుకోవడంతో వారిని మండల పరిషత్ కార్యాలయం అధికారులు ,సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, ఈసీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడే మాడ్చేస్తోంది...


విజయవాడ, ఫిబ్రవరి 3,చాలా సంవత్సరాల క్రితం వేసవి కాలం అంటే ఏప్రిల్, మే నెలలని చెప్పుకునే వారు. కానీ ఇప్పుడు మాత్రం ఫిబ్రవరి మొదటి వారంలోనే వేసవి మొదలైపోతుంది. ఏటా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు పెరుగుదల నమోదవుతుంది. గత శతాబ్ద కాలంలో 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డైన సంగతి తెలిసిందే. 2025 కూడా అదే మాదిరిగా ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. 2023 లో ఆరు నెలలు, 2024 లో ఏడాది పొడవునా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.1901 నుంచి సేకరిస్తున్న సమాచారం ప్రకారం.. 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించింది. ఉష్ణోగ్రత సగటున 0. 65 డిగ్రీలు పెరిగింది.గతేడాది జనవరి నుంచి ఫిబ్రవరి మధ్యలో సాధారణం కంటే 0.37 డిగ్రీలు పెరిగింది. ఈ ఏడాది జనవరిలో ఉష్ణోగ్రత సగటున 0.94 డిగ్రీలు పెరిగింది.1958 లో 1.17,1990 లో 0.97 డిగ్రీలు పెరిగాయి. ఆ తర్వాత ఇదే హైయ్యేస్ట్ గా తెలుస్తుంది.వాతావరణ మార్పుల ప్రభావం లానినా పరిస్థితుల పై పడుతోంది. లానినా పరిస్థితులు బలహీనపడడంతో శీతాకాలంలోనూ చలి తీవ్రత అసాధారణంగా లేదు. వచ్చే వారం నుంచి తూర్పు, మధ్య భారతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే సూచనలున్నాయి. ఉత్తర, మధ్య ,తూర్పు భారతంలోని కొన్ని ప్రాంతాల్లో అయిదు డిగ్రీల వరకు పెరుగుతాయని నిపుణులు భావిస్తున్నారు.దక్షిణ ,వాయువ్య భారతంలోని కొన్ని మినహా అన్ని ప్రాంతాల్లోనూ వేడి వాతావరణం నెలకొంటుందని చెబుతున్నారు. కేరళలో జనవరిలోనే ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి.రాష్ట్రంలో రాబోయే రోజుల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.రెండు రోజులుగా ఉక్కపోత ప్రారంభమైంది. కర్నూలు జిల్లా ఆదోని లో శుక్రవారం గరిష్ఠంగా 35.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు, అన్నమయ్య, వైఎస్సార్ , ప్రకాశం, నంద్యాల, అనకాపల్లి , శ్రీసత్యసాయి ,కర్నూలు,అనంతపురం,తిరుపతి, ఎన్టీఆర్ , ఏలూరు తదితర జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగాయి.తెలుగు రాష్ట్రాల్లో కోస్తాంధ్రతో పోలిస్తే రాయలసీమ, తెలంగాణలో ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# కేశినేని నాని ఎక్కడ...



విజయవాడ ఫిబ్రవరి 3, విజయవాడ మాజీ పార్లమెంటు సభ్యులు కేశినేని నాని ఎన్నికల తర్వాత పూర్తిగా కనుమరుగయిపోయారు. రాజకీయంగా ఆయన తీసుకున్న నిర్ణయం ఆయన గెలుపుకు ఫుల్ స్టాప్ పెట్టేసింది. గెలిచే పార్టీ నుంచి ఓటమిని తెచ్చిపెట్టే పార్టీ వైపు ఆయన మొగ్గుచూపారు. కనీసం ట్రాక్ రికార్డు చూసైనా కేశినేని నాని తన నిర్ణయాన్ని తీసుకోలేదని ఆయన సన్నిహితులు అంటున్నారు. వాపును చూసి తన బలం అనుకుని ఆయన నిలువునా మునిగిపోయారని భావించారు. వ్యాపారంలనూ, రాజకీయాల్లోనూ కేశినేని నాని ఇబ్బందులు పడటానికి ఆయన ఇగో కారణమని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పట్టువిడుపులకు పోకపోవడం వల్లనే హ్యాట్రిక్ సాధించి రికార్డుల కెక్కాల్సిన కేశినేని నాని అజ్ఞాతంలోకి వెళ్లారంటున్నారు. కేశినేని నానికి తొలి నుంచి కొంత దూకుడు ఎక్కువ. నిర్ణయాలు తీసుకోవడంలో వెనకా ముందూ ఆలోచించరు. అసలు విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో మూడు సార్లు వరసగా గెలిచిన వారు లేనే లేరు. అదొక సెంటిమెంట్ కావచ్చు. లేక బెజవాడ వాసులు హ్యాట్రిక్ విజయానికి మొగ్గుచూపకపోవచ్చు. విజయవాడ లోక్ సభ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ రెండుసార్లు వడ్డే శోభనాద్రీశ్వరరావు, లగడపాటి రాజగోపాల్, చెన్నుపాటి విద్య మాత్రమే గెలిచారు. ఒకే ఒక్కరు మూడు సార్లు విజయం సాధించారు. కానూరి లక్ష్మణరావు 1962, 1967, 1971 లో గెలిచారు. ఆ తర్వాత అంటే 1971 తర్వాత అంటే ఐదు దశాబ్దాల నుంచి మూడు సార్లు వరసగా గెలిచిన వారు లేనే లేరు.కానీ కేశినేని నాని మాత్రం మూడోసారి తాను గెలుస్తామని భావించారు. టీడీపీని తక్కువగా అంచనా వేశారు. ఢిల్లీలో తనకంటూ ఒక ప్రత్యేకత ఉందని ఆయన భావించాం ు.చంద్రబాబు ఢిల్లీ వచ్చినప్పుడు కూడా కనీసం బొకే ఇచ్చేందుకు కూడా ఆయన నిరాకరించి పార్టీ అగ్రనాయకత్వం ఆగ్రహానికి గురయ్యారు. మరొకవైపు లోకేష్ నాయకత్వాన్ని కూడా కేశినేని నాని ప్రశ్నించే పరిస్థితికి వచ్చింది. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో టీడీపీ నేతలతోనూ సఖ్యతగా మెలగలేదు. దేవినేని ఉమ, బోండా ఉమ, బుద్దా వెంకన్న వంటి వారితో కయ్యానికి దిగారు. ఇలా అనేక రకాలుగా కేశినేని నాని తీసుకున్న నిర్ణయాలకు ఆయన సోదరుడు కేశినేని శివనాథ్ తోనే టీడీపీ చెక్ పెట్టగలిగింది. 2024 ఎన్నికలకు ముందు అనూహ్యంగా వైసీపీలో చేరి పోటీ చేసి ఓటమి పాలయిన కేశినేని నాని తన ఓటమిని జీర్ణించుకోలేకపోయారు. వ్యాపారాన్ని క్లోజ్ చేసినట్లుగానే ఆయన రాజకీయాల నుంచి కూడా నిష్క్రమించినట్లు ప్రకటించారు. కానీ ఎన్నికల నాటికి మళ్లీ కేశినేనినాని బయటకు వస్తారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతానికి కేశినేని నాని అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లే కనిపిస్తుంది. సన్నిహితులకు, ఆయను నమ్మి పదేళ్ల పాటు వెంట తిరిగిన వారికి కూడా అందుబాటు లో లేరని చెబుతున్నారు. తిరిగి టీడీపీలోకి వస్తారా? లేక వైసీపీలో యాక్టివ్ అవుతారా? తెలిసీ కేశినేని నాని చేసుకున్న స్వయంకృతం ఆయనను పంపేలా చేసిందన్న కామెంట్స్ వినడుతున్నాయి.

# భయపెడుతున్నకోళ్ల వైరస్



ఏలూరు, ఫిబ్రవరి 3,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కోటి కోళ్లు మృత్యువాత పడ్డాయి. నిత్యం వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయని పౌల్ట్రీ రైతులు లబోదిబోమంటున్నారు. గతేడాది డిసెంబర్ లో మొదలైన వైరస్ వ్యాప్తి...జనవరి 13 తర్వాత తీవ్రమైందని రైతులు అంటున్నారు. ఆరోగ్యంగా కనిపించిన గంటల వ్యవధిలోనే కోళ్లు మృతి చెందుతున్నాయని వాపోతున్నారు. కోళ్లలో ఊ15ఔ వైరస్ లక్షణాలు ఉన్నట్లు వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. ఈ వైరస్ శరవేగంగా వ్యాపిస్తుండడంతో...పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ప్రమాదకర వైరస్ సోకడంతో ఉమ్మడి జిల్లాలో ఇదివరకే 1 కోటి 20 లక్షలకిపైగా కోళు చనిపోయాయని వైఎస్సార్ సీపీ ఆరోపించింది. అవి తాము చెప్పిన మాట కాదని, కోళ్ల మరణాలపై అధికారులు చెప్పిన వివరాలేనని వైసీపీ అంటోంది. కొళ్ల ఫారాలు వద్ద చనిపోయిన కోళ్లు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. మరోవైపు కోడిగుడ్ల ఎగుమతి భారీగా పడిపోయిందని వైసీపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. హైపాతోజనిక్ అవేయిన్ ఇన్ఫ్లూఎంజా స్ట్రెయిన్ వైరస్ సోకినట్లు పశు సంవర్ధక శాఖ అనుమానం వ్యక్తం చేస్తోంది. కూటమి ప్రభుత్వం కోళ్ల వ్యాధులపై కనీసం అవగాహన కల్పించడం లేదని, ఆత్మహత్యలే శరణ్యమని పౌల్ట్రీ రైతులు అంటున్నారంటూ వైసీపీ నేతలు మండిపడుతున్నారు.కాగా, డిసెంబర్ నెలలో ఊ5ఔ1 వైరస్ కేసులు మొదలయ్యాయని, జనవరిలో వాటి తీవ్రత మరింత పెరిగిందని పౌల్ట్రీ రైతులు చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో 2012, 2020లోనూ వైరస్ రావడంతో కోళ్లు భారీగా చనిపోగా, పౌల్ట్రీ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ సమయంలో చికెన్ తినాలంటే కూడా ప్రజలు వణికిపోయేవారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 50 శాతం రైతులు నష్టపోయారని తెలుస్తోంది. దాదాపుగా 40 లక్షల కోళ్లు చనిపోయి ఉంటాయని అంచనా. మేత తిని, గుడ్డు పెట్టిన కొద్ది గంటల్లోనే కోళ్లు మృత్యువాత పడుతున్నాయని రైతులు అంటున్నారు. కోళ్లకు వ్యాక్సిన్ వేస్తున్నా... ఉపయోగం ఉండడంలేదని చెబుతున్నారు. దీంతో బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు పెరిగి రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని పౌల్ట్రీ రైతులు వాపోతున్నారు.2012, 2020లో ఇదే తరహాలో వైరస్ వ్యాపించి లక్షల్లో కోళ్లు చనిపోయాయి. అయితే ప్రస్తుతం గతంలో కంటే వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇంత భారీ సంఖ్యలో కోళ్లు చనిపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైరస్ వ్యాప్తికి కారణాలు తెలియకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరీక్షల నిమిత్తం కోళ్ల బ్లడ్ శాంపిల్స్ భోపాల్ కు పంపుతున్నామని రైతులు చెప్పారు. ఈ వైరస్ వ్యాప్తిని విపత్తుగా ప్రకటించి, తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.పశ్చిమ గోదావరి జిల్లాలో లక్షలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. వైరస్ సోకడంతో జిల్లాలో ఇప్పటికే 1 కోటి 20 లక్షలకిపైగా కోళ్లు చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.కోళ్ల ఫారాలు వద్ద గుట్టలు గుట్టలుగా చనిపోయిన కోళ్లు ఉన్నాయి. దీంతో కోడిగుడ్ల ఎగుమతి భారీగా పడిపోయింది. హైపాతోజనిక్ అవేయిన్ ఇన్ఫ్లూఎంజా స్ట్రెయిన్ వైరస్ సోకినట్లు పశు సంవర్ధక శాఖ అనుమానాలు వ్యక్తం చేస్తుంది. కోళ్ల వ్యాధులపై కూటమి ప్రభుత్వం కనీసం అవగాహన కల్పించడంలేదు. నష్టాలతో ఆత్మహత్యలే శరణ్యం అని పౌల్ట్రీ రైతులు అంటున్నారు" -వైసీపీఖమ్మం జిల్లాలోతెలంగాణ లోని ఖమ్మం జిల్లాలో అంతుచిక్కని వైరస్ సోకి వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. పెనుబల్లి మండలంలో ఉప్పయ్య అనే వ్యక్తికి చెందిన కోళ్ల ఫారంలో మూడు వేల బ్రాయిలర్ కోళ్లు, కొత్త కారాయ గూడెం గ్రామంలోని నాగేశ్వరరావుకు చెందిన కోళ్ల ఫారంలో మూడు వేల బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడ్డాయి. వరుసగా కోళ్లు చనిపోతుండడంతో వెటర్నరీ అధికారులు అప్రమత్తమై... కోళ్ల మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు హైదరాబాద్ వెటర్నరీ పరిశోధన టీమ్ కు సమాచారం ఇచ్చారు. దీంతో రీసెర్చ్ టీమ్ కోళ్ల ఫారాలను పరిశీలించి శాంపిల్స్ సేకరించింది.కరోనా సమయంలో చికెన్ తింటే అనారోగ్యం బారిన పడతామని కొన్ని రోజులు వీటికి దూరంగా ఉన్నారు. అప్పటి ప్రభుత్వం అవగాహనా కల్పించడంతో చికెన్, కోడిగుడ్ల విక్రయాలు ఊపందుకున్నాయి

# కోట్లు కురిపించిన రిజిస్ట్రేషన్లు...

విశాఖపట్టణం, ఫిబ్రవరి 3, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. ఆస్తుల క్రయ, విక్రయ రిజిస్ట్రేషన్ల ద్వారా.. ఒకరోజే రూ.139 కోట్ల ఆదాయం వచ్చింది. గురువారం కూడా రూ.107 కోట్ల వరకు ఆదాయం వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఈ రెండు రోజుల్లోనే రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.246 కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమ అయ్యాయి.భూముల కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమల్లోకి వచ్చాయి. సవరించిన విలువలతో రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం పెరిగింది. దీంతో ఛార్జీల భారం పడకుండా.. జనవరి 30, 31వ తేదీల్లో ఎక్కువ మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఆస్తుల క్రయ, విక్రయదారులతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు రద్దీగా కనిపించాయి. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోనే ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. జనవరి 31న ఎక్కువ ఆదాయం వచ్చిన టాప్ 10 జిల్లాల వివరాలు ఇలా ఉన్నాయి.

1.విశాఖపట్నం- రూ.16.94 కోట్లు
2.గుంటూరు- రూ.16.92 కోట్లు
3.ఎన్టీఆర్ జిల్లా- రూ.12.07 కోట్లు
4.తూర్పుగోదావరి- రూ.11.35 కోట్లు
5.తిరుపతి- రూ.8.94 కోట్లు
6.కృష్ణా జిల్లా- రూ.6.69 కోట్లు
7.కాకినాడ- 6.14 కోట్లు
8.పశ్చిమ గోదావరి- రూ.5.78 కోట్లు
9.నెల్లూరు- రూ.5.69 కోట్లు
10.అనంతపురం- రూ.5.19 కోట్లు

20 శాతం వరకు..

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపుపై చర్చ జరుగుతుంది. జనవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరుగుతాయనే ప్రచారం కూడా జరిగింది. అయితే దీనిపై రెవెన్యూ మంత్రి అనగాని స్పష్టత ఇస్తూ.. ఫిబ్రవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీలు అమలవుతాయని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా సగటున 0 నుంచి 20 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరుగుదల ఉండనుంది. కొన్ని ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు 0 శాతం మాత్రమే ఉంటాయి.

విజయవాడ, విశాఖపట్నం తోపాటు కోనసీమ, ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరిగాయి. మరికొన్ని చోట్ల ఛార్జీలను తగ్గించారు. అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంచకూడదని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఇక్కడ పాత ఛార్జీలే ఉండనున్నాయి. రాష్ట్రంలో ఎక్కడ గ్రోత్ కారిడార్లు ఉన్నాయో అక్కడ రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరిగాయి.


# విజయ'సాయి' రెడ్డిగా మారిపోయారా...

## నిన్న షర్మిళ, ఇవాళ నందమూరి ఫ్యామిలితో భేటీలు

విజయవాడ, ఫిబ్రవరి 3,ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలను మాజీ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు రోజుల క్రితం హైదరాబాద్ లో వీరి భేటి జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. వైఎస్ షర్మిల ఇంటికి వెళ్లిన విజయసాయిరెడ్డి అక్కడే భోజనం చేసి అనేక విషయాలపై చర్చించినట్లు చెబుతున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ లండన్ నుంచి బెంగళూరుకు వచ్చే ముందే ఈ పర్యటన జరిగినట్లు తెలిసింది. ఇందుకు రాజకీయ కారణాలు ఏమై ఉంటాయన్న దానిపై జోరుగా చర్చ జరుగుతుంది. విజయసాయిరెడ్డి, వైఎస్ షర్మిల ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న రోజులను కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. వీరి భేటీ ఏ వైపునకు దారితీస్తుందన్న చర్చ జరుగుతుంది. వైసీపీ రాజ్యసభ సభ్యత్వంతో పాటు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి తాను వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించారు. ఈ మేరకు ఆయన కర్ణాటకలో తాను వ్యవసాయం చేసుకుంటున్నట్లు సోషల్ మీడియాలోనూ ఫొటోలు పోస్టు చేశారు. తాను ఇక రాజకీయాలను పట్టించుకోనని తెలిపారు. అలాగని వైఎస్ జగన్ ను విమర్శించలేదు. తన వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అదే సందర్భంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ తో కూడా తనకు విభేదాలు లేవంటూ ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో జగన్ ను తీవ్రంగా విమర్శిస్తున్న వైఎస్ షర్మిలను కలవడంతో ఏం జరిగి ఉంటుందన్న దానిపై వైసీపీ నేతలు ఆరా తీస్తున్నారు.జగన్ ఆస్తుల విషయంలోనూ విజయసాయిరెడ్డి వైఎస్ జగన్ పక్షాన నిలిచారు. షర్మిలకు వ్యతిరేకంగా వ్యాఖ్యానించారు. విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన తర్వాత కూడా షర్మిల ఆయనపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే జగన్, షర్మిల మధ్య రాజీ కుదర్చడానికి ఆయన భేటీ అయ్యారా? లేక షర్మిలకు తాను చేసిన వ్యాఖ్యల వెనక ఉన్న వాస్తవాలను వివరించడానికి కలిశారా? అన్నది తెలియాల్సి ఉంది. విజయసాయిరెడ్డి రాజీనామాతో ఇప్పటికే వైసీపీ క్యాడర్ లో కొంత నిరాశగా ఉంది. ఈ సమయంలో షర్మిలతో భేటీ కావడంతో జగన్ కుటుంబంలో ఏదో జరుగుతుందన్న భావన కలుగుతుంది. అయితే వైసీపీ నేతలు మాత్రం ఈ భేటీని అంత తేలిగ్గా కొట్టిపారేయడం లేదు. షర్మిల కూడా విజయసాయిరెడ్డి విషయంలో సానుకూలతను ప్రదర్శించడంపై ఏపీలో హాట్ టాపిక్ గా మారింది.మరో వైపు తెలుగు రాష్ట్ర రాజకీయాలలో విజయసాయి రెడ్డి తాజా అడుగులు సంచలనం అవుతున్నాయి. వైసీపీ నుంచి రాజ్యసభకు వెళ్ళిన ఆయన తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. త్వరలో వైసిపి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయనున్నారు. ప్రస్తుతం వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి లండన్లో ఉన్నారు. ఆయన రాక కోసం విజయసాయి రెడ్డి వెయిట్ చేస్తున్నారు. వచ్చిన తర్వాత రాజీనామా సమర్పించనున్నారు. రాజకీయాలకు ఆయన గుడ్ బై చెప్పారు. కుటుంబంతో కలిసి టైమ్ స్పెండ్ చేస్తున్నారు. అయితే నందమూరి కుటుంబంతో ఆయన కనిపించడం కొంత మందికి మింగుడు పడడం లేదు. వైసిపికి విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన తర్వాత భారతీయ జనతా పార్టీలో చేరే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు తమ తమ అంచనాలు చెప్పారు. తెలుగుదేశం పార్టీకి దగ్గర అయ్యే అవకాశాలను కూడా కొట్టి పారేయలేమని ఇంకొందరు జోస్యం చెప్పారు. ప్రస్తుతానికి అయితే ఆయన రాజకీయ నాయకులు ఎవరితోనూ కనిపించడం లేదు. కానీ... నందమూరి కుటుంబానికి దగ్గరగా ఉన్నారు.నందమూరి కుటుంబ సభ్యుడు దివంగత కథానాయకుడు, తారక రత్న భార్య అలేఖ్య తెలుసు కదా! విజయసాయి రెడ్డితో పాటు దిగిన ఫోటోను ఆవిడ సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'వీకెండ్ విత్ వీఎస్ఆర్' అని పేర్కొన్నారు. అది అసలు సంగతి. ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. విజయసాయి రెడ్డి మళ్లీ రాజకీయాల్లోకి వచ్చినా రాకున్నా... ఆయన కుమార్తె మాత్రం బీజేపీలో చేసే అవకాశం ఉందట.నందమూరి కుటుంబానికి కోడలు కాకముందు నుంచి విజయసాయి రెడ్డితో అలేఖ్యకు బంధుత్వం ఉంది. ఆమెకు ఆయన బాబాయ్ వరుస అవుతారు. తారకరత్న, అలేఖ్య వివాహానికి అప్పట్లో ఇరువురి కుటుంబ సభ్యులు అంగీకరించకపోతే... విజయసాయి రెడ్డి తమకు మద్దతు ఇచ్చారని అలేఖ్య గతంలో తెలిపారు.

# నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

కాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు ప్రతీయేట ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ రోజును




యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ చే స్థాపించబడింది, 2008లో వ్రాసిన వరల్డ్ క్యాన్సర్ డిక్లరేషన్ లక్ష్యాలకు మద్దతుగా ఉంది. 2020 నాటికి క్యాన్సర్ వల్ల అనారోగ్యం, మరణం గణనీయంగా తగ్గించటమే దిని లక్ష్యం. ప్రపంచ క్యాన్సర్ డే లక్ష్యం ప్రజల్లో అవగాహన పెంచడం తద్వారా క్యాన్సర్ కళంకం తగ్గించడం. క్యాన్సర్తో బాధపడుతున్నవారికి మద్దతు ఇవ్వడానికి ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంలో అనేక కార్యక్రమాలు అమలులో ఉన్నాయి.ఈ ఉద్యమాలలో ఒకటి నొ హెయిర్ సెల్ఫి అనే గ్లోబల్ కదలిక, భౌతికంగా లేదా వాస్తవంగా క్యాన్సర్ చికిత్సకు గురయ్యే వారికి ధైర్య చిహ్నంగా ఉండటానికి వారి తలలకు గుండు

# ప్రారంభమైన జ్యాడిషియల్ విచారణ

తిరుపతి, ఫిబ్రవరి 3,తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించిన ఘటనపై జ్యుడీషియల్ ఎంక్వైరీ ప్రారంభమైంది. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తి నేతృత్వంలోని కమిషన్ తొక్కిసలాట ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపనుంది. ఆరునెలల్లోగా నివేదిక సమర్పించాలని కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది. టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టోకెన్ల జారీ క్యూలైన్‌లో ఆరుగురు మరణించారు.జనవరి నెల 8వ తేదీన జరిగిన ఈ తొక్కిసలాట ఘటనను తీవ్రంగా పరిగణించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హుటాహుటిన తిరుపతి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఇద్దరు అధికారుల సస్పెన్షన్, ముగ్గురు అధికారుల బదిలీలు చేశారు. బాధిత కుటుంబాలకు టీటీడీ తరఫున నష్టపరిహారం సైతం చెల్లించారు. ఈ ఘటనపై మాజీ న్యాయమూర్తితో విచారణకు ఆదేశించారు. తిరుపతిలోని పద్మావతి పార్క్ వద్ద జరిగిన తొక్కిసలాటలో వైకుంఠ ఏకాదశి దర్శనానికి టోకెన్ల కోసం ఎదురుచూస్తున్న ఆరుగురు భక్తులు మరణించడానికి దారి తీసిన పరిస్థితులేమిటో కమిషన్ విచారణ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.మరోవైపు విచారణ కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఛాంబర్ కేటాయించారు. తొక్కిసలాట ప్రాంతాలను కమిషన్ సభ్యులు పరిశీలించారు.

## కర్నూలు రేంజ్ డిఐజిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ .



విభారే న్యూస్ ఫిబ్రవరి 03 కర్నూలు జిల్లా ప్రతినిధి.. జిల్లా నూతన ఎస్పీ గా భాద్యతలు స్వీకరించిన సంధర్భంగా విక్రాంత్ పాటిల్ ఐపియస్ కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్ ని కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

## శ్రీ ఈరన్నస్వామికి బంగారు విగ్రహం విరాళం..



విభారే న్యూస్ ఫిబ్రవరి 03 కౌతాళం..కౌతాళం మండలం లోని ఉరుకుందలో వెలసిన శ్రీ నరసింహ ఈరన్న స్వామికి మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా మంత్రాలయం ఎమ్మెల్యేబాలనాగిరెడ్డిబంగారుతోచేయించిన శ్రీ ఈరన్నస్వామి విగ్రహాన్ని ఆలయ అధికారి విజయరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులకు అందజేశారు. అంతకు ముందు ఈరన్నస్వామి విగ్రహంతో ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. అనంతరం పూజలు నిర్వహించారు.ఇందులో ఎమ్మెల్యే బంధువులు పాల్గొన్నారు.

## వసంత పంచమి సందర్భంగా వాసవి మాతకు విశేష పూజలు..



విభారే న్యూస్ ఫిబ్రవరి 03 ఎమ్మిగనూరు..శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వసంత పంచమి పురస్కరించుకొని వాసవి మాతకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే నగేశ్వర స్వామి అమ్మవార్లకు అభిషేకం అర్చన అలంకారం మహా మంగళహారతి తదితర పూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అన్నీయు ఆలయ అర్చకులు గురు ప్రసాద్ వారిచే నిర్వహించబడినవి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు

## వసంత పంచమి సందర్భంగా సరస్వతి అలంకరణలో గాయత్రీ దేవి..

విభారే న్యూస్ ఫిబ్రవరి 03 ఎమ్మిగనూరు..స్థానిక గీతా నగర్ లో ఉన్న శ్రీ గాయత్రీ దేవాలయంలో శ్రీ శ్యామలా నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు గాయత్రి మాతకు అలంకరణ గావించడం జరిగినది. అందులో భాగంగానే సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని శ్రీ గాయత్రీ దేవి కి సరస్వతి అలంకరణ గావించడం జరిగినది.. శ్రీ గాయత్రి మాత భక్తులకు సరస్వతి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రతిరోజు ప్రాతః కాలంలోనే గాయత్రి మాతకు అభిషేకం, అష్టోత్తరం, అలంకరణలు పై పూజా కార్యక్రమాలన్నీ ఆలయ అర్చకులు బలకుంది నరహరిశాస్త్రిచేగావించబడినవి.



# అవినీతికి పాల్పడుతున్న వార్డెన్స్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలి

**పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్**

విభారే న్యూస్ ఆదోని: ఆదోని డివిజన్ వ్యాప్తంగా ఉన్నటువంటి సంక్షేమ హాస్టల్ దయనీయ స్థితిలో ఉన్నాయని కర్నూలు జిల్లా అధ్యక్షుడు అఖండ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...అంతేకాకుండా హాస్టల్ వార్డెన్లు సమయపాలన పాటించలేకపోవడం వల్ల విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారు.హాస్టల్లో మెను ప్రకారంగా భోజనం పెట్టకపోవడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్న పరిస్థితి ఉంది.హాస్టల్ వార్డెన్స్ రీజన్స్ లేకుండా సెలవు పెట్టడం, రెండు,మూడు హాస్టల్ కు ఇంచార్జ్ ఉండడం వల్ల హాస్టల్లో సమస్యలు ఎక్కడవి అక్కడే నిలిచిపోయాయి.ఆ సమస్యలను హాస్టల్ వార్డెన్లు పట్టించుకోకపోవడం వల్ల హాస్టల్ విద్యార్థులే ఆ పనులను చేయాల్సిన దుస్థితి మన ఆదోని డివిజన్ వ్యాప్తంగా ఉంది.ఈ విధంగా ఉండటం వల్ల ఇంతకు ముందు గర్ల్స్ హాస్టల్ లో విద్యార్థులతో కాయగూరలు కోపియ్యడం జరిగింది .ఇప్పుడు విద్యార్థులు నీళ్లు మోస్తున్న పరిస్థితి ఉంది.హాస్టల్లో విద్యార్థులు పనిచేస్తున్న పట్టించుకోని ం ః ా చి ా కుల్లయ్యప్ప సార్. హాస్టల్లో విద్యార్థులకు హాస్టల్ మెనూ పాటించకుండా నాణ్యత మైనటువంటి భోజనం పెట్టకుండా విద్యార్థులు కడుపు కొడుతూ హాస్టల్ వార్డెన్స్ అవినీతికి పాల్పడుతున్నారు



.కర్నూల్ జిల్లా మన ఆదోని డివిజన్ వ్యాప్తంగా కరువు కాటకాలతో తల్లిదండ్రులు వలసలు వెళ్తున్నారు.ఈ విధంగా వలసలు వెళ్లడం వల్ల తల్లిదండ్రులతో పాటు విద్యార్థులను కూడా పని చేయడానికి వలసలకు తెలుసుకొని పోవాల్సిన పరిస్థితి ఉంది.ఈవిధంగా విద్యార్థులు వలసలు వెళ్లడం వల్ల చదువుకు దూరంఅవుతున్న దుస్థితి ఉంది. విద్యార్థులు వలసలు వెళ్లకుండాకాపాడవలసినటువంటి బాధ్యత విద్యా అధికారులకు ఉంది కాబట్టి విద్యార్థులకు ఉపయోగపడే సీజనల్ హాస్టల్ తక్షణమే ఏర్పాటుచేసి విద్యార్థులను ఆదుకోని అవినీతి అక్రమాలకు పాల్పడిన వార్డెన్స్ పై తక్షణమే విచారణ జరిపి చర్యలుతీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘంగాకోరుతున్నాం.ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా నాయకుడు అనిల్,డివిజన్ నాయకులు మహేష్,హరి, గర్జప్ప,అనిల్, సంతోష్,అభిమిత్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం...



విభారే న్యూస్ ఫిబ్రవరి 03 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 93 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) బెంగుళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3 లక్షలు తీసుకొని బెంగుళూరు కు చెందిన మనీషా జాబ్ కన్సల్టెన్సీ పేరుతో మోసం చేసిందని కర్నూలు, ఎన్ ఆర్ పేట కు చెందిన సమీర్ ఫిర్యాదు చేశారు. 2) నా కుమారుడు రాజు ప్రతి రోజు మద్యం సేవించి వచ్చి డబ్బులు ఇవ్వాలంటూ నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు,మద్దూర్ నగర్ కు చెందిన అన్నమ్మ ఫిర్యాదు చేశారు. 3) హైదరాబాద్ లో గుడ్ క్రాప్ ఐటి సోల్యూషన్స్ ప్రవేట్ లిమిటెడ్ కు చెందిన చంద్రశేఖర్ నాయుడు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ. 2 లక్షల 60 వేలు తీసుకొని,3 నెలల పాటు పని చేయించుకుని జీతాలు ఇవ్వకుండా, ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేశాడని కర్నూలు, పార్వతి నగర్ కు చెందిన కుర్వ ఆంజనేయులు, ఈశ్వర్ చందు ఫిర్యాదు చేశారు. 4)టెలిగ్రామ్ యాప్ లో వచ్చిన ట్రేడింగ్ లింక్ ను క్లిక్ చేసి చిన్న చిన్న మొత్తాలు డిపాజిట్ చేశాను,లాభాలు వస్తున్నాయనే నమ్మకంతో పెద్ద మొత్తాలలో డిపాజిట్ చేసినప్పుడు డబ్బులు తిరిగి రాలేదని రూ. 61,600 సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోయానని రికవరీ చేయించాలని కర్నూలు,ఎల్.వెంకయ్య నగర్ కు చెందిన విశ్వకార్తీక్ ఫిర్యాదు చేశారు. 5)తెలియని వ్యక్తులు నా అన్న పై దాడి చేయడంతో పాటు ఇంటికి వచ్చి దుర్భాషలాడుతున్న వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, ఎన్టీఆర్ బిల్డింగ్స్, రాములవారి వీధికి చెందిన భవాని ఫిర్యాదు చేశారు. 6)నా పొలం ప్రక్కన ఉన్న గఫూర్ అతని పొలంలోని ఎక్కువగా ఉన్న నీళ్ళనునా పొలం లోకి వదిలి పంట నష్టం చేస్తున్నాడని వృధా అవుతున్న నీళ్ళకు అడ్డు కట్ట వేయకుండా నా పై బెదిరింపులకు పాల్పడుతున్నాడని ప్యాలకుర్తి కి చెందిన ఖాజా బందే నవాజ్ ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి,బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా,సిఐ శివశంకర్ పాల్గొన్నారు.

# పోలీసు "ప్రజా సమస్యల పరిష్కార వేదికకు " 95 ఫిర్యాదులు: జిల్లా ఎస్పీ. అధిరాజ్ సింగ్ రాణా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 – నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా 95 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ ఫిర్యాదులలో సివిల్ తగాదాలు,కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయని తెలిపారు .ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు ప్రతి సోమవారం మీకు దగ్గరలోని పోలీస్ స్టేషన్, సర్కిల్ ఆఫీస్, డిఎస్పి కార్యాలయాల్లో జరిగే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా పీజిఆర్ ఎస్ ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు నంద్యాల ఎస్ డీ పీ ఓ మంద. జావళి ఆల్ఫోన్స్ పాల్గొన్నారు.

## టౌన్ బ్యాంకు చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి..



విభారే న్యూస్ ఫిబ్రవరి 03 ఎమ్మిగనూరు..స్థానిక కోపరేటివ్ టౌన్ బ్యాంక్ నూతన పాలకవర్గాన్ని (నామినేటెడ్ బాడి) ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ జనవరి 31 వ తేదీన జీవో జారీ చేసింది.. ప్రభుత్వ జీవోలో చైర్మన్గా ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, వైస్ చైర్మన్ గా బండా నర్సప్ప, సభ్యులుగా మహబూబ్ బాషా, రవికుమార్, జి. వెంకటగిరి, భీమేష్, వాల్మీకి రాజు, వెంకటేశ్వర రెడ్డి, షాలెం, నవీన్ కుమార్, నరసింహులు లను నియమిస్తూ జీవో జారీ అయింది. కొత్తగా ఏర్పాటు కానున్న పాలకవర్గము 7వతేదీ(శుక్రవారం)బ్యాంకు ఆవరణం లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. చైర్మన్ ఉరుకుందయ్య శెట్టి ఆదివారంవసంతపంచమిసందర్భంగాపదవి బాధ్యతలను చేపట్టారు.మిగతాసభ్యులు7నప్రమాణ స్వీకారం చేయనున్నారు. చైర్మన్తో పాటు వైస్ చైర్మన్ బండా నరసప్ప బాధ్యతలను చేపట్టారు. అనంతరము నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులందరూచైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్యను పూలమాల, దుశ్యాలువతో సన్మానించారు. చైర్మన్ ఉరుకుందయ్య అందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

## 6300805117 ఇది ఫేక్ నెంబర్ పట్టణ ప్రజలు జాగ్రత్త

**--మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి**



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 – పట్టణంలోని వివిధ వాణిజ్య ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహించే వారికి 6300805117 ఈ ఫోన్ నెంబర్ నుంచి తాము నంద్యాల పురపాలక సంఘానికి సంబంధించిన వారమని తెలియజేస్తూ ఫేక్ కాల్స్ చేసి ట్రేడ్ లైసెన్స్ రుసుమును మీరు చెల్లించవలేనని ఆ మొత్తాన్ని ఈ నెంబర్ ద్వారా6300805117ఫోన్పే చెల్లించమని అడుగుతున్నారని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి వివరించారు . సోమవారం ఒక ప్రకటన కమిషనర్ విడుదల చేశారు . పురపాలక సంఘానికి సంబంధించిన శానిటరీ ఇన్స్పెక్టర్ లకు పలు ఫిర్యాదులు చేసి ఉన్నారని ఈ ఫిర్యాదు దృష్ట్యా తక్షణమే పట్టణంలోని పోలీస్ శాఖ వారికి ఫిర్యాదు చేసామన్నారు మీయొక్కట్రేడ్ లైసెన్సులను సచివాలయంలోని శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ వారి ద్వారా రెన్యూవల్ మరియు కొత్త ట్రేడ్ లైసెన్స్ లను పురపాలక సంఘంలో పొందవలసి ఉంటుందని చెప్పారు . ఎటువంటి ఫోన్ పే లకు సదరు లైసెన్స్ రుసుములు చెల్లించవద్దని కోరారు. ఒకవేళ మీరు పై తెలిపిన నెంబరు కు ఫోన్ పే చేసినట్లయితే మున్సిపాలిటీ ఆమొత్తానికిఎటువంటి భాద్యత వహించద న్నారు.టి. మురళీధర్ శానిటరీ సూపర్ వైజర్ – 9849906654డి. లక్ష్మి నారాయణ శానిటరీ ఇన్స్పెక్టర్ – 9849907458 కె.శివప్రసాద్ రెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్ – 9849908002పి.లక్ష్మి నారాయణ శానిటరీ ఇన్స్పెక్టర్ ? 7702776049. అందుబాటులో ఉంటారని వివరాలకు ఈ ఫోన్ నెంబర్లకు తెలపాలని సూచించారు .

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190